ఉపాధి హామీ పథకంపై ప్రజావేదిక

ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

ఇటిక్యాల, ఫిబ్రవరి 18 : ఉమ్మడి మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు అమలు చేసిన ఉపాధి హామీ పథకంపై మంగళవారం ప్రజా వేదిక నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ నర్సింగ్‌రావ్ పాల్గొన్న సమావేశంలో సామాజిక తనిఖీ చేపట్టిన బృందం సభ్యులు గ్రామ పంచాయతీల వారీగా పథకంలో ఖర్చుచేసిన నిధులు, పనుల పురోగతిపై నివేదికలను చదివి వినిపించారు. మస్టర్లలో వైట్‌నర్ ఉపయోగించి కూలీల నమోదు, మార్పులు చేయడం, కొన్ని పనులకు సంబంధించి తనిఖీ బృందానికి రికార్డులను సమర్పించకపోవడం, జాబ్‌కార్డులను రెన్యూవల్ చేయక పోవడం, కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో నిర్వహణ సరిగా లేక ఎక్కువ సంఖ్యలో మొక్కలు చనిపోయి ఉండటం వంటివి తనిఖీ బృందం గుర్తించింది. ఈ విషయమై సమగ్రంగా పరిశీలించి రికవరీ ఉంటుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సునంద, ఎంపీడీవో అజర్ మొహియుద్దీన్, ఉపాధి సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

కంటి వైద్య శిబిరాన్ని సందర్శించిన ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో సిద్దప్ప

గద్వాలటౌన్, ఫిబ్రవరి 18 : కంటి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు ప్రత్యేక శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో సిద్దప్ప తెలిపారు. జిల్లా దవాఖానలో ఈనెల 17 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు నిర్వహించనున్న కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పాఠశాలల్లో వసతి గృహాల్లో 5వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న 2,188 మంది విద్యార్థులకు కంటి జబ్బు సమస్యలు ఉన్నట్లు తెలిపారు. కంటికి సంబంధించిన లోపాలను గుర్తించి అద్దాలు అవసరమైన వారికి అద్దాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీ హెచ్ఎస్ రమేశ్ చంద్ర, డాక్టర్లు తన్వీర్‌రిజ్వానా, ప్రసూన రాణి, కార్తీక్, ప్రతిమలింగ, జయరాజ్, అధికారులు మధుసూదన్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి

పాన్‌గల్, ఫిబ్రవరి 18 : మండలంలోని కొత్తపేట, మాందాపూర్ మీదుగా బుసిరెడ్డిపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని మాజీ జెడ్పీటీసీ రవి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆర్టీసీ డిపోలో అధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్రం, కొండా రెడ్డిపాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే విజయం సిద్ధిస్తుంది

పూర్వ విద్యార్థులను సన్మానిస్తున్న కళాశాల డీన్, అధ్యాపకులు

పెద్దమందడి, ఫిబ్రవరి 18 : నిరంతరం సాధనతోనే విజయం సిద్ధిస్తుందని మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సైదయ్య అన్నారు. మంగళవారం మండలంలోని మోజర్ల ఉద్యాన కళాశాలలో పూర్వ విద్యార్థులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ సైదయ్య మాట్లాడుతూ గత సంవత్సరం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యాన అధికారుల నియామకానికి పరీక్షలు జరిగాయని, అందులో మొత్తం 21 పోస్టులకు నియామకాలు చేపట్టగా మోజర్ల ఉద్యాన కళాశాల విద్యార్థులు పది మంది ఉత్తీర్ణులై ఉద్యాన అధికారులుగా వివిధ జిల్లాల్లోని ఉద్యాన శాఖ కింద అధికారులుగా విధుల్లో చేరారన్నారు. నూతనంగా ఉద్యాన అధికారులుగా బాధ్యతలు చేపట్టిన మహేశ్, వినాయక రుద్ర, శివ తేజ, వెంకటరమణలను చేపట్టారని పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగాలు పొందిన వారిని కళాశాల డిన్‌తో పాటు అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ షహనాజ్, డాక్టర్ పూర్ణిమ మిశ్రా, డాక్టర్ శంకరస్వామి, డాక్టర్ శ్రీనివాస్, నవ్య, శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★ I, MOHAMMED MUKTHAR S/o MOHAMMED ABDUL SATTAR, Passport No: N 7985480.R/o: 4-2-98/1, Ramaiah Bowli, Mahabub Nagar - 509001, Changed my name as MOHAMMED MUQTAR.
NT-MBNR

CHANGE OF NAME
★ I, MOHAMMED MUQTAR QUADRI S/o MOHAMMED ABDUL SATTAR, R/o:4-2-98/1, Ramaiah Bowli, Mahabub Nagar - 509001, Changed my name as MOHAMMED MUQTAR.
NT-MBNR

CHANGE OF NAME
★ I, RAFEEQ SULTANA W/o MOHAMMED ABDUL HALEEM, R/o:1-8-159/2, T.D.Gutta, Fire Station, Mahabub Nagar - 509001, Changed my name as RAFEEQ UNNISA BEGUM.
NT-MBNR

CHANGE OF NAME
★ I, KHAJA ATHARUDDIN S/o MOHAMMAD KHAJA TAHER NIZAMUDDIN, R/o:1-53/2, Bijinapally Mandal, Nagarkurnool - 509203, Changed my name as MOHAMMAD KHAJA ATHARUDDIN.
NT-MBNR

CHANGE OF NAME
★ I, MOHAMMED SHOAIB RASHEED NATHANI S/o ABDUL RASHEED NATHANI, R/o: 1-6-61/C/11, Back Side Of Collector Office, Subash Nagar, Mahabub Nagar - 509001, Changed my name as MOHAMMED SHOAIB ABDUL RASHEED NATHANI.
NT-MBNR

కావలెను
★ మహబూబ్‌నగర్‌లో ప్రముఖ సోలార్ కంపెనీలో పనిచేయుటకు ITI ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ చేసిన వారు కావలెను. సంప్రదించు 8686166354, 7842520780.
NT-MBNR

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

శిక్షణ అనుభవాన్ని సక్రమంగా వినియోగించుకోవాలి

- కలెక్టర్ సంతోష్

సచివాలయ సేవల సెక్షన్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

గద్వాల, ఫిబ్రవరి 18 : ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో పొందిన శిక్షణ అనుభవాన్ని సక్రమంగా ఉపయోగించుకోవాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు సూచించారు. మంగళవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ 139వ స్థాయి –డీ శిక్షణ కార్యక్రమంలో భాగంగా కేంద్ర సచివాలయ సేవల సెక్షన్ అధికారులు 16మంది బృందంతో శిక్షణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల క్రియాశీల అమలుతోనే ప్రజలకు నిజమైనా లబ్ధి కలుగుతుందని పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా అధికారులు మల్దకల్ మండలంలోని శేషంపల్లి, గద్వాల మండలంలోని కొత్తపల్లి ధరూర్ మండలం లోని జాంపల్లి, కేటిదొడ్డి మండలంలోని మైలగడ్డ గ్రామాలు, గద్వాల మున్సిపాలిటీ వంటి ప్రాంతాలను సందర్శించి పథకాల అమలు తీరును పరిశీలించారని పేర్కొన్నారు. వ్యవసాయం, డీఆర్డీవో, మిషన్‌భగీరథ, జెన్కో, జాతీయ గ్రామీణ జీవనోపాధి, స్వచ్ఛ మిషన్, స్వచ్ఛభారత్, చేయూత పింఛన్లు తదితర ప్రభుత్వ పథకాలపై విశ్లేషణ చేపట్టాలని తెలిపారు. కలెక్టర్ అధికారులతో తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ పర్యటన భవిష్యత్‌లో కొత్త విధానాలు అమలు చేయడంలో ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అధికారులు రమేష్‌బాబు, కేంద్ర సచివాలయ సేవల సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మిషన్ మధుమేహ సర్వే

పాన్‌గల్, ఫిబ్రవరి 18 : మండల కేంద్రంతోపాటు కేతేపల్లి, అన్నారం గ్రామాల్లో మధుమేహ ఇంటింటి సర్వే కొనసాగుతున్నదని మండల వైద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. గ్రామాల్లో 30 సంవత్సరాలు పైబడిన వారు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు రాంచందర్, శ్రీలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హుండీ చోరీ

అయిజ, ఫిబ్రవరి 18 : మండలంలోని బైనపల్లి మారెమ్మ ఆలయంలో చోరీ జరిగింది. సోమవారం రాత్రి ఆలయంలోకి ప్రవేశించిన దుండగులు హుండీని ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లారు. గతేడాది నుంచి హుండీలోని నగదు లెక్కించలేదని, భారీ మొత్తంలోనే నగదు, ఆభరణాలు ఉండే అవకాశం ఉందని గ్రామస్తులు తెలిపారు. హుండీ చోరీకి గురైన విషయం తెలుసుకున్న అయిజ ఎస్సై శ్రీనివాసరావు బీట్ పోలీసులతో ఆలయంలో చోరీ జరిగిన తీరుపై వివరాలు తెలుసుకున్నారు.

గ్రామస్తులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతామని ఎస్సై తెలిపారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

- ఎస్పీ రావుల గిరిధర్

అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

అమరచింత, ఫిబ్రవరి 18 : నేటి పిల్లలే రేపటి తరం భావి తరాలకు మార్గదర్శకులని తల్లిదండ్రులు ఎప్పుడు తమ పిల్లల బంగారు భవిష్యత్ కోసం ఉన్నత లక్ష్యలను నిర్దేసిస్తూ పెంచాలని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని భక్తమార్కండేయ స్వామి ఆలయ ఆవరణలో అమరచింత హ్యాండ్లూమ్, సిల్క్స్, వివార్స్ (ఎంఎస్ఎంఈఎస్) ఆధ్వర్యంలో టైలరింగ్ మహిళలకు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం కంపెనీ సీఈవో మహంకాళి చంద్ర శేఖర్ అధ్యక్షత వహించగా నోడల్ ఏజెన్సీ సంస్థ అధికారి రాజ్‌కుమార్, ఆర్‌డీఎస్ సీఈవో చిన్నమ్మ థామస్, ఎస్పీ రావుల గిరిధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాగా కంపెనీ ప్రతినిధులు వారికి మొక్కలను అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు డబ్బులపై అత్యాశతో సైబర్ నేరగాళ్ల చేతిలో సులువుగా మోసపోతున్నారని, సెల్ ఫోనులో వచ్చే మేసేజ్‌లకు, లింక్‌లను ఓపెన్ చేసి, మీఅకౌంట్‌లో డబ్బులు పడ్డాయని చెప్పగానే వారు ఎవరు, ఏమిటీ అని తెలుసుకోకుండా తొందరపడి తమ వివరాలను చెప్పడంతోనే సైబర్ నేరగాళ్లు క్షణాల్లో మీ అకౌంట్లలో ఉన్న డబ్బులను కాజేస్తున్నారన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలను లక్ష్యంగా పెట్టుకుని చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈఎస్ టైలరింగ్ శిక్షకుడు సుధాకర్‌గౌడ్, సిబ్బంది అశోక్, కావేరి, అమరచింత ఎస్సై సురేశ్, మహిళలు, చేనేత కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

- 50 ఏండ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెబ్బేరు, ఫిబ్రవరి 18 : యాభై ఏండ్ల కిందట విడిపోయిన ఆ విద్యార్థులు మళ్లీ మంగళవారం కలుసుకున్నారు. పెబ్బేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1974 బ్యాచ్ చెందిన పదో తరగతి విద్యార్థులు స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశమై ఆ నాటి మధుర క్షణాలను నెమరేసుకున్నారు. అప్పట్లో తమకు పాఠాలు బోధించిన కొందరు గురువులను సన్మానించారు. తాము పదో తరగతి చదివి 50 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మీయసమ్మేళనం నిర్వహించుకున్నామన్నారు.

బాధితులకు రిఫండ్ ఆర్డర్స్ కాపీలు పంపిణీ

బాధితులకు రిఫండ్ ఆర్డర్ కాపీలు అందజేస్తున్న టౌన్ ఎస్సై కల్యాణ్‌కుమార్

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 18 : సైబర్ నేరాలకు గురైతే 1930 కు లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో 24 గంటల్లోగా ఫిర్యాదు చేస్తే పోగొట్టుకుంటున్న అమౌంట్ తిరిగి పొందవచ్చని టౌన్ ఎస్సై కల్యాణ్‌కుమార్ అన్నారు. ఇటీవల సైబర్ క్రైమ్‌లో డబ్బులు పోగొట్టుకున్న ఆరుగురు బాధితులు, గట్టు పరిధిలో ఒకరు, గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదుగురికి సంబంధించిన రూ.30,130లను ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మంగళవారం రిఫండ్ ఆర్డర్ కాపీలను బాధితులకు అందజేశారు. డబ్బు పోగొట్టుకున్న బాధితులు వెంటనే 1930కు కాల చేయడంతో సైబర్ క్రైమ్ వారియర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కేసును ఛేదించి, గద్వాల జిల్లా లీగల్ సర్వీసెస్ అథార్టీ కార్యదర్శి జడ్జి కవిత ద్వారా రిఫండ్ ఆర్డర్ కాపీలను తీసుకొని బాధితులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, బాధితులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

గోపాల్‌పేట, ఫిబ్రవరి 18 : విద్యుదాఘాతంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ ఘటన మండలంలోని చాకల్‌పల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు గ్రామానికి చెందిన కొండా రెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న 63 కేవీ ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఫ్యూజ్ వైర్ వేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం వనపర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్ తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

రాజోళి, ఫిబ్రవరి 18 : మండల కేంద్రంలో బుధవారం శివాజీ జయంతిని పురస్కరించుకొని మెగా రక్తదాన శిబిరం జై శ్రీరామ్ సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఉత్సాహంగా స్వయంపరిపాలన దినోత్సవం

ఖిల్లాఘణపురం/పెబ్బేరు, ఫిబ్రవరి 18 : ఖిల్లా ఘణపురం మండల కేంద్రంలోని హరిజనవాడ పాఠశాల, పెబ్బేరు మండలం వై.శాఖాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్క రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఖిల్లా ఘణపురం పాఠశాల హెచ్ఎం మాధవి విద్యార్థులకు అవసరమయ్యే క్రీడా సామగ్రిని ఎంఈవో జయశంకర్, కాంప్లెక్స్ హెచ్ఎం కాళిదాసు చే అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

పెబ్బేరు : స్వయం పరిపాలనా దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

కబడ్డీ ఆడుతున్న క్రీడకారులు

రాజోళి, ఫిబ్రవరి 18 : మండలంలోని తుమ్మిళ్లలో అంతరాష్ట్ర కబడ్డీ పోటీలు హోరాహోరీగా యువత కేరింత మధ్య సాగాయి. మంగళవారం తుమ్మిళ్లలో ఎల్లమ్మ ఉత్సవాల సందర్భంగా బలరాంరెడ్డి, రామాంజనేయులు గౌడ్, వెంకటేశ్ సహకారంతో అంతరాష్ట్ర కబడ్డీ పోటీలను నిర్వహించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. వివిధ జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన 30 టీమ్‌లు పోటీల్లో పాల్గొన్నాయి. అనంతరం ప్రతిభ కనబరిచిన టీంలకు బహుమతులు అందజేశారు.

ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలి

- పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి
- వీసీలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 18 : రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని ముఖ్య కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీసీకి జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు రానీయొద్దని, పంటలు ఎండి పోకుండా రైతులు సాగునీరు, డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. రేషన్‌కార్డుల దరఖాస్తుల ధ్రువీకరణ, రైతుభరోసా పథకాల అమలుపై చర్చించారు. కలెక్టర్లు తమ పరిధిలో ఆకస్మికంగా తనిఖీలు చేస్తూ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఇప్పటి వరకు 3ఎకరాల వరకు 63శాతం పట్టదారులకు రైతు భరోసా సాయం పొందారన్నారు. మిగిలిన ప్రక్రియను 5రోజుల్లో పూర్తి చేయాలన్నారు. సమీక్షలో ట్రాన్స్‌కో ఎస్ఈ తిరుపతిరావు, ఇరిగేషన్ ఈఈ రహీముద్దీన్, అధికారులు శ్రీనివాస్, సక్రియా నాయక్, స్వామికుమార్ తదితరులు ఉన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు స్థల పరిశీలన

పాఠశాల కోసం స్థలాన్ని పరిశీస్తున్న అధికారులు

వడ్డేపల్లి, ఫిబ్రవరి18 : మండల కేంద్రంలోని మాధవస్వామి గుట్టపై ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి స్థలాన్ని మంగళవారం గురుకుల పాఠశాలల రాష్ట్ర సెక్రటరీ రవినాయక్ పరిశీలించారు. 377 సర్వే నెంబర్‌లో 25ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న పాఠశాలకు స్థల పరిశీలనతోపాటు సమీపంలో వసతులు, రోడ్డు సౌకర్యం, బస్సు, రైలు తదితర సౌకర్యాలను అదనపు కలెక్టర్ నర్సింహారావు, తాసీల్దార్ ప్రభాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మ్యాప్‌ను పరిశీలించారు. సమీపంలో కస్తూర్బా, పాలిటెక్నిక్ పాఠశాల, ప్రభుత్వ దవాఖాన, మున్సిపాలిటీ కార్యాలయం, ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్ ఉందని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ ఎల్ఆర్ ఏడీ రామందర్, తాసీల్దార్ ప్రభాకర్, ఆర్ఐ ఆంజనేయులు, సర్వేయర్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 18 : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ఎరువుల దుకాణం, వ్యవసాయ ఉత్పత్తులు మార్కెటింగ్ చేసేందుకు సీఈవో పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేశ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ అగ్రికల్చర్, బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, డిగ్రీలో కెమిస్ట్రీ సబ్జెక్టు, అగ్రికల్చర్‌లో డిప్లొమా కోర్సు తప్పనిసరిగా కలిగి ఉండాలని, కంప్యూటర్ విద్యలో కనీసం పీజీడీసీఏ పూర్తి చేసి ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. దరఖాస్తులు చేసుకునే వారు ఈనెల 25న సాయంత్రం 5 గంటల లోపు dpmlivelihoodswp@gmail.com ఈమెయిల్ ద్వారా చేసుకోవాలని చెప్పారు.

కేసుల పరిష్కారానికి 'జాతీయ లోక్ అదాలత్'

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 18 : ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ గొప్ప అవకాశమని, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత అన్నారు. మంగళవారం జిల్లా ప్రధాన న్యాయస్థానం సమావేశ మందిరంలో మార్చి 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజినితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ మార్చి 8వ తేదీన జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులు, వివాదాలను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

తాసీల్దార్‌గా షాహిదాబేగం

మల్దకల్, ఫిబ్రవరి 18 : మల్దకల్ మండల నూతన తాసీల్దార్‌గా షాహిదా బేగం మంగళవారం బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ పనిచేసిన జుబేర్ మహినోద్దీన్ హైదరాబాద్‌లోని సర్వే డిపార్టుమెంట్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కేటీదొడ్డి మండలంలో పనిచేస్తున్న షాహిదా బేగం మల్దకల్ మండలానికి వచ్చారు.

హక్కుల పరిరక్షణలో భాగస్వాములు కావాలి

పాన్‌గల్, ఫిబ్రవరి 18 : బాలికల హక్కుల పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ సంధ్యారాణి, ఎస్సై శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గర్ల్‌చైల్డ్ ఎంపవర్మెంట్ కమిటీ సదస్సులో వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలు, మానసిక, శారీరక చర్యలపట్ల బాలికలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంఈవో శ్రీనివాసులు, కిరణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ హైమావతి, సుధారాణి ఉన్నారు.

జిల్లా స్వయం ఉపాధి శిక్షణ కేంద్రానికి రూ.2కోట్లు మంజూరు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 18 : జిల్లాలోని గ్రామీణ యువతకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా రూ.2కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే మేఘారెడ్డి చెప్పారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో శిక్షణ కేంద్ర భవన నిర్మాణానికి ప్రభుత్వం అంగీకారం తెలిపిందని అందుకు కృషి చేసిన నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిక్షణ కేంద్రం ఏర్పాటుతో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు.

ఇసుకను ఉచితంగా అందించాలి

వనపర్తిటౌన్, ఫిబ్రవరి 18 : ఇండ్ల నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా అందించాలని భవన నిర్మాణ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గంధం మదన్, జిల్లా కార్యదర్శి నిక్సన్ మంగళవారం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ఆరు నెలలుగా వెల్ఫేర్ బోర్డులో ఆన్‌లైన్ సక్రమంగా పనిచేయ్యకపోవడమే కారణంచే పెండింగ్ బిల్లులు, రెన్యూవల్ సమస్యలు పరిష్కారం కావడం లేదని పేర్కొన్నారు. జిల్లాలో 450 చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని వాగుల్లో, చెరువుల్లో, కాలువల్లో సమృద్ధిగా ఇసుక దొరుకుతుందని భవన నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వెంకటయ్య, పుల్లయ్య, కురుమయ్య, గట్టన్న, రాములు, కురుమూర్తి, నాగన్న, భాస్కర్, రాములు, నరేందర్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించేదాకా పోరాడుదాం

గద్వాల రూరల్, ఫిబ్రవరి 18 : కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తున్న కేంద్రం ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వెంటనే సవరించాలని, బడ్జెట్‌ను సవరించే వరకు వామపక్ష పార్టీలుగా ప్రజల పక్షాన పోరాడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, సీపీఐ జిల్లా సభ్యుడు ఆశన్న అన్నారు. వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని పాల బస్టాండ్‌లోని వైఎస్ఆర్ చౌరస్తా వద్ద సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులు పెట్టుబడిదారులపై విధించే పన్నును 22శాతం నుంచి 15 శాతానికి తగ్గించారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధిని పెంచే ఉపాధిహామీ పథకానికి నిధులతో కోతలు విధిస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్‌కు అనుకూల ఈ బడ్జెట్‌ను సవరించి విద్య, వైద్యం, గ్రామీణ ఉపాధి హామీ తదితర సంక్షేమ రంగాలకు నిధుల కేటాయింపు పెంచేవరకు వామపక్ష పార్టీలుగా ప్రజలకు అండగా నిలిచి పోరాడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పేరు నర్సింహ, వీవీ నర్సింహ, రంగన్న, వెంకట్రామిరెడ్డి, చిన్న మస్తాన్, పవన్, భీముడు, రామాంజనేయులు, నరేశ్, మహేశ్, రంగన్న ఉన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

గోపాల్‌పేట, ఫిబ్రవరి 18 : మండలంలోని ఏదుట్లకు చెందిన గుడ్ల కురుమూర్తి జనవరి నెలలో తన సెల్ ఫోన్ పోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ అనే సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ ఆచూకీ గుర్తించి సెల్‌ఫోన్ రికవరీ చేసి మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి ఎస్సై నరేశ్‌కుమార్ అందజేశారు.

పదో తరగతి జీవితంలో కీలకం

పాన్‌గల్, ఫిబ్రవరి 18 : పదో తరగతి జీవితంలో కీలకదశ, ఇక్కడ సాధించే విజయం భావిజీవితాన్ని నిర్దేశిస్తుందని ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని చిక్కేపల్లి ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట జీహెచ్ఎం శివయ్య, ఉపాధ్యాయులు భాస్కర్ పాల్గొన్నారు.